క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



సంజీవ్‌రెడ్డిని కలిసిన భోగవల్లి నాగభూషణం

మల్కాపురం: ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవ్‌రెడ్డిని శుక్రవారం జిల్లా ఇంటక్ ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా ఐఎన్‌టీయూసీ పాకెట్ క్యాలెండర్‌ను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. అనంతరం విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, సంస్థలో కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు వంటి సమస్యలపై ఆయనతో భోగవల్లి చర్చించారు.స్టీల్‌ప్లాంట్ కార్మిక సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి వారికి న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు.

హిందుస్థాన్ జిందాబాద్.. ఉగ్రవాదం నశించాలి



కొత్తపాలెం ప్రధాన రహదారిలో జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

గోపాలపట్నం: కశ్మీర్ పహల్గామ్‌లో ఉగ్రవాదులు చేసిన మారణ హోమం చాలా దారుణమని జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం మస్జిద్ ఏ నూరానియా సంఘ సభ్యులు ఏక కంఠంతో ఖండించారు. శుక్రవారం కొత్తపాలెంలో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. హిందుస్థాన్ జిందాబాద్.. ఉగ్రవాదం నశించాలంటూ నినాదాలు చేశారు. కొత్తపాలెం ప్రధాన రహదారుల్లో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ముస్లిం సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్విజ్ పోటీ



విజేతలతో క్విజ్ మాస్టర్ సూర్యారావు

సీతంపేట: ద్వారకానగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు శుక్రవారం క్విజ్ పోటీ నిర్వహించారు. పౌర గ్రంథాలయం సొసైటీ నిర్వహించిన ఈ పోటీలకు గ్రంథాలయ సహాయ కార్యదర్శి డాక్టర్ డి.వి.సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. వర్తమాన అంశాలు, ఆర్థిక వ్యవస్థ, చరిత్ర, రాజ్యాంగం, విజ్ఞాన సాంకేతిక శాస్త్రాలు, భూగోళ శాస్త్రంపై క్విజ్ పోటీ జరిగింది. పోటీలో 60 మంది విద్యార్థులు ఏడు బృందాలుగా పాల్గొన్నారు. ఏడు రౌండ్లలో జరిగిన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు పుస్తకాలను బహూకరించారు. ప్రధాన గ్రంథ పాలకురాలు దుర్గారాణి పర్యవేక్షించారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.





- అధ్వానంగా ప్రశాంతినగర్ గెడ్డ
- నివాసాల మధ్య కళాశాలకు చేరువలో..
- దుర్వాసన వస్తోందని ఆందోళన

గెడ్డలు ఘోరం!

ఫోకస్



గెడ్డల నిర్వహణ గాడితప్పింది. ఆక్రమణల బెడద పెరిగింది. విశాలంగా ఉన్న ప్రధాన గెడ్డలు సైతం ఇరుగ్గా మారుతున్నాయి. మురుగు, వరదనీటి ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పూడికలు, వ్యర్థాలు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. అయినా పాలకులు, అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇదే కోవలోకి వస్తుంది జీవీఎంసీ 91, 92వ వార్డు పరిధి ప్రశాంతినగర్ గెడ్డ. వార్డుల పరిధిలో ఉన్న ఈ గెడ్డ విశాలంగా ఉండేది. దీని నిర్వహణను రెండు వార్డుల పారిశుధ్య సిబ్బంది పట్టించుకోవడం మానేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గెడ్డలో వ్యర్థాలు వేస్తుండడం వల్ల ఎగువ ప్రాంతాల నుం,ఇ వచ్చి ఇక్కడ నిలిచి పోతున్నాయని వాపోతున్నారు. దీంతో దుర్వాసన, దోమల బెడద ఎక్కువగా ఉంటోందని వాపోతున్నారు. పిచ్చి మొక్కలు పెరగడంతో పాములు, విషపురుగుల బెడద ఉందని భయపడుతున్నారు. అధికారులు స్పందించి వ్యర్థాలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

– గోపాలపట్నం

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

సింథియా: సీపీఐ 25వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గుడాల రాంబాబు పిలుపునిచ్చారు. 63వ వార్డు కాకరలోవ కూడలిలో శుక్రవారం మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి, తోటి నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే 10, 11 తేదీల్లో నగరంలోని మురళీనగర్‌లో మహాసభలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు కంచరపాలెం మెట్టు నుంచి ఓల్డ్ ఐటీఐ జంక్షన్ వరకు పాదయాత్ర చేస్తామని, ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మహాసభలకు ప్రత్యేక ఆహ్వానితులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, సీనియర్ కామ్రేడ్ స్టాలిన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గంగాభవానీ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో కామేశ్వరరావు, సాంబమూర్తి, రంజాన్ అప్పారావు, సురేష్, కనకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా.. ఇంకుడు గుంత

గోపాలపట్నం: 'నీటిని ఒడిసి పట్టుకుందాం.. ప్రతి ఇంటా ఇంకుడు గుంత నిర్మించుకుందాం' అనే నినాదంతో చేపట్టిన ఇంకుడు గుంతలు తవ్వించే కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో తవ్విన ఇంకుడు గుంత గురించి తెలుసుకున్న 89వ వార్డు యల్లపువానిపాలెం సంతోషినగర్ కాలనీకి చెందిన దాడి వెంకటప్పారావు తన ఇంటి వద్ద గుంత తవ్వించాడు. దీనిని శుక్రవారం జేడీ ఫౌండేషన్ సభ్యులు పరిశీలించారు. ఇటీవల ఇదే ప్రాంతం గణేష్‌నగర్‌లో హనుమంతు రమేష్ ఇంకుడు గుంత తవ్వించడాన్ని చూసి వెంకటప్పారావు స్ఫూర్తి పొందాడని వారు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం సహకారం కావలసిన వారు జేడీ ఫౌండేషన్ సభ్యులను సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా వెంకటప్పారావుకు పర్యావరణ హితమైన గుడ్డ సంచిని అందించారు. ప్లాస్టిక్ సంచులు వాడొద్దని, వాడించొద్దని సూచించారు.



వెంకటప్పారావుకు క్లాత్ బ్యాగు అందిస్తున్న జేడీ ఫౌండేషన్ సభ్యులు

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ చేయాలని ధర్నా



ధర్నాలో పాల్గొన్న జగ్గునాయుడు తదితరులు

గాజువాక: జీవో 296 ప్రకారం గతంలో మంజూరు చేసిన ఇళ్ల పట్టాలకు సర్వ హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ డీడ్‌లను ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై గాజువాక తహసీల్దార్ కార్యాలయంవద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ 296 జీవో ప్రకారం మంజూరు చేసిన పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయడంతో పాటు జీవో 30 ప్రకారం కుంచుమాంబ కాలనీ, స్వతంత్రనగర్, రామ్‌నగర్, అప్పన్న కాలనీ, రామచంద్రనగర్ కాలనీలలో అర్హులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం గాజువాక కార్యదర్శి ఎం.రాంబాబు, నాయకులు డి.రమణ, ఎ.లోకేష్, కిరీటం, సంతోషం, బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్ల అందజేత

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు చెందిన 2023–25 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులకు ఎన్‌సీసీ శిక్షణ పూర్తి కావడంతో సర్టిఫికెట్లు అందజేశారు. 11 ఆంధ్రా ట్రూప్ కమాండర్ చీఫ్ ఆఫీసర్ ఎం.ఎస్.వి.విశ్వనాథం ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న 15 మంది క్యాడెట్లకు కల్నల్ అజయ్‌కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాలలో పదవ తరగతిలో ప్రతిభ చూపిన ఎన్‌సీసీ క్యాడెట్ అమలాపురం దినేష్‌కు రూ.6 వేల చెక్ అందజేశారు. ఈ సందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ విశాఖ జిల్లాలో ఎన్‌సీసీ ఉన్న ఏకైక జీవీఎంసీ పాఠశాలలో మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకుందన్నారు. మొదటి సంవత్సరం 40 తరగతులు, రెండవ సంవత్సరం 40 తరగతులు, ఒక యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌నందు శిక్షణ పొంది 375 మార్కులకు రాత పరీక్ష, 125 మార్కులకు మౌఖిక పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. 500 మార్కులకు 400 మార్కులు దాటిన వారికి 'ఏ' గ్రేడ్, 351 నుంచి 399 మార్కులు వచ్చిన క్యాడెట్లకు 'బి' గ్రేడ్, 300 నుంచి 350 వరకు 'సి' సర్టిఫికెట్లు అందజేశారని తెలిపారు. సర్టిఫికెట్లు అందుకున్న క్యాడెట్లను స్కూల్ హెచ్‌ఎం లక్ష్మీనరస అభినందించారు. ఈ కార్యక్రమంలో సుబేదార్ మేజర్ జయప్రకాష్, హవల్దార్ శ్యామలరావు, పాఠశాల పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పలరాజు పాల్గొన్నారు.



క్యాడెట్లను అభినందిస్తున్న హెచ్‌ఎం లక్ష్మీనరస

అందరికీ వాకర్స్ క్లబ్ సభ్యత్వం



సమావేశంలో తీర్మానం ప్రవేశపెడుతున్న క్లబ్ అధ్యక్షుడు భానుప్రకాష్

మురళీనగర్: వాకర్స్ అందరికీ వాకర్స్ క్లబ్‌లో సభ్యులుగా చేరేందుకు అవకాశం కల్పిస్తున్నామని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సనపల భాను ప్రకాష్ తెలిపారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ప్రత్యేక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్‌లో చేరడానికి ప్రస్తుతం ఉన్న శాశ్వత సభ్యత్వ రుసుమును రూ.5,000 నుంచి రూ.3,000కు తగ్గిస్తూ ఆయన తీర్మానం ప్రవేశపెట్టగా, కార్యవర్గ సభ్యులు ఓటింగ్ ద్వారా ఆమోదించారు. దీనివల్ల సంస్థలో సభ్యుల సంఖ్య పెరగడమే కాకుండా సభ్యత్వ రుసుము అందరికీ అందుబాటులో ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. సభ్యత్వ నమోదుకు కార్యాలయంలో సంప్రదించాలని భానుప్రకాష్ సూచించారు. వివరాలకు 7659804633, 9491292369 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షులు ఎన్.బుచ్చయ్య, ఎ.రామకృష్ణారెడ్డి, కార్యదర్శి సీహెచ్ ప్రసాదరావు, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, సహాయకార్యదర్శి ఎన్.ప్రకాశరావు, జాలీ వాకర్ ఎన్.మాధవి తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ ఒలింపిక్స్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి, కలెక్టర్

విశాఖ విద్య: రాష్ట్రస్థాయిలో సమగ్ర శిక్ష పాఠశాల విద్యాశాఖ నిర్వహించిన స్పెషల్ ఒలింపిక్స్ భారత్–2025 క్రీడా పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు ఏలూరు జిల్లా నూజివీడు మండలం ఆగిరిపల్లి హిల్ పారడైజ్ స్కూల్‌లో ప్రత్యేక అవసరాల గల పిల్లలకు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. జిల్లాకు చెందిన విద్యార్థులు సత్తాచాటి పలు పతకాలు సాధించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వీరిని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, కలెక్టర్ హరేందిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, డీఈవో ఎన్.ప్రేమ్ కుమార్ అభినందించారు. సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ జె.చంద్రశేఖరరావు, సహిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయమూర్తులతో సమావేశం



సమావేశంలో పాల్గొన్న న్యాయమూర్తులు

గాజువాక: గాజువాక ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన ఎం.వి.శేషమ్మతో గాజువాక న్యాయవాదుల సంఘం ప్రతినిధులు, న్యాయవాదులు శుక్రవారం మర్యాదపూర్వక సమావేశం నిర్వహించారు. గాజువాక బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు యశోధర వేదమణి, డి.చిరంజీవి న్యాయవాదులను ఆమెకు పరిచయం చేశారు. బెంచ్, బార్ అసోసియేషన్ల మధ్య మంచి సంబంధాలు ఉంటే కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. సమావేశంలో 13వ అదనపు జిల్లా జడ్జి జి.షణ్ముఖరావు, 8వ అదనపు జిల్లా జడ్జి కె.కవిత, సీనియర్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ యార్లగడ్డ శ్రీలక్ష్మి, వి.పల్లవి తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు'ను స్ట్రాటజిక్ రంగంలోకి మార్చాలి

ఉక్కునగరం: ఉక్కు రంగాన్ని నాన్ స్ట్రాటజిక్ నుంచి స్ట్రాటజిక్ రంగంలోకి మార్చాలని నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఆఫీసర్స్ అసోసియేషన్(ఎన్‌సీవోఏ) తీర్మానించిందని విశాఖ స్టీల్‌ప్లాంట్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటం చంద్రరావు, కేవీడీ ప్రసాద్ తెలిపారు. మనాలిలో జరిగిన ఎన్‌సీవోఏ నేషనల్ జనరల్ కౌన్సిల్ సమావేశంలో కాటం చంద్రరావు, కేవీడీ ప్రసాద్‌లతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన పలు అధికారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్న సెయిల్, విశాఖ స్టీల్‌ప్లాంట్, నగర్‌నార్ ప్లాంట్, డిజైన్ సంస్థ మెకాన్, మైనింగ్ సంస్థ కేఐవోసీఎల్‌లను విలీనం చేసి ఒకే గొడుగు కిందకు తీసుకు రావాలని తీర్మానించారు.

ఉచిత సంగీత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



తాటిచెట్లపాలెం: స్థానికంగా ఉన్న మాస్టర్ ఇ.కె. సంస్కృతీ సదన్ సంగీత జనకులం ఆధ్వర్యంలో ఉచితంగా కర్ణాటక సంగీతం, గాత్ర, వాయిద్య సంగీతం, వేదాభ్యాసాలలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంగీత జనకులం అధ్యక్షుడు ఇంద్రగంటి కాశీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ తరగతులలో చేరదలచుకున్నవారు ఏప్రిల్ 27వ తేదీ ఉదయం 9 గంటలలోగా సంప్రదించాలని కోరారు. మొత్తం నాలుగు విభాగాలుగా ఈ శిక్షణ ఉంటుందన్నారు. చేపట్టనున్నారు. మొదటి విభాగంలో సంవత్సరం శాస్త్రీయ సంగీత అవగాహన తరగతులు, రెండవ విభాగంలో వాయిద్య సంగీతం, వేణుగాన సంగీత శిక్షణ, మూడవ విభాగంలో ఐదు సంవత్సరాల గాత్ర, సంగీత తరగతులు, నాలుగవ విభాగంలో వేదాభ్యాసంలో భాగంగా మాస్టర్ ఇ.కె. అందించిన నిత్య షోడశోపచార పూజా విధానంలోని ఋుగ్వేద సూక్తాలలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వివరాలకు సంస్కృతి సదన్ సంగీత జనకులం కార్యాలయంలో స్వయంగా గానీ లేదా 93983 14502 నంబర్‌లో గానీ సంప్రదించాలని కోరారు.

జాగ్రత్తలతో వ్యాధులు దూరం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మలేరియా విభాగ అధికారులు భవాని, రవికుమార్

మల్కాపురం: పలు జాగ్రత్తలు పాటిస్తే వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చునని జిల్లా మలేరియా విభాగం హెల్త్ టెక్నికల్ సూపర్‌వైజర్ భవాని అన్నారు.పారిశ్రామిక ప్రాంత మలేరియా విభాగ అధికారి డి.రవికుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ఎక్కువగా మలేరియా వ్యాధి బారిన పడుతున్న తొలి ఐదు దేశాల జాబితాలో నైజీరియా,డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో,మొజాంబిక్, బుర్కినా ఫోసో,సియార్రాలియోస్ దేశాలు ఉన్నాయన్నారు. మలేరియా ఒక అంటు వ్యాధి అని ఈ పరాన్నజీవికి దోములు వాహకంగా పని చేస్తాయని చెప్పారు. అయితే దీన్ని స్వీయ నివారణ చేసుకోవచ్చన్నారు. ఈ వ్యాధికి ఎలాంటి వ్యాక్సిన్లు అందుబాటులో లేవన్నారు. జ్వరం,శరీరం చలిగా ఉండడం,వాంతులు,వికారం,ఒంటి నొప్పులు,తలనొప్పి,దగ్గు,డయేరియా వంటివి మలేరియా వ్యాధి లక్షణాలు అని వివరించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కొబ్బరిబోండాలు,రబ్బర్ టైర్లు,ఇంట్లో నీటి నిల్వలు రోజుల తరబడి లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మల్కాపురం మలేరియా ఏరియా విభాగ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు మేలు చేసేలా ఉపాధి శిక్షణ తరగతులు



ప్రశంసాపత్రాలతో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ చర్చి ఆవరణలోని జ్యోతి నిలయంలో డాన్‌బాస్కో నవజీవన్ సంస్థ మహిళలకు అందించిన ఉచిత టైలరింగ్ శిక్షణ శుక్రవారం ముగిసింది. ముఖ్య అతిథిగా పునీత పేతురు దేవాలయం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ హాజరై మాట్లాడారు. మహిళలు ఉన్నతంగా ఎదిగేందుకు ఇలాంటి ఉపాధి శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. టైలరింగ్ పూర్తి చేసిన మహిళలు స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని హితవు పలికారు. డాన్‌బాస్కో నవజీవన్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. వేసవిలో చిన్నారులకు మరిన్ని ఉచిత శిక్షణ సేవలు అందించాలని సంస్థ సభ్యులను కోరారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన శిక్షకులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఫాదర్లు పి.అరుణ్‌దాస్, ఇగ్నేషియస్, సంస్థ సమన్వయకర్త సిస్టర్ పెర్లే, శిక్షకురాలు అనిత, క్రాంతి, సతీష్, పీఆర్‌వో కోరాడ బాలమణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ విద్యార్థులకు 100 శాతం ఉద్యోగాలు



మాట్లాడుతున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల పరిధిలో పీజీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నామని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు పేర్కొన్నారు. సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం 'కెరీర్ ప్లానింగ్–ప్రొఫెషనల్ స్కిల్స్ ఫర్ సోషల్ వర్క్ స్టూడెంట్స్' అనే అంశంపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగిస్తూ వందేళ్లు పూర్తి చేసుకున్న విశ్వ కళాపరిషత్ లక్షలాది మంది విద్యార్థులను జాతికి అంకితం చేసిందన్నారు. పూర్వ విద్యార్థులే వర్సిటీకి తరగని సంపదగా అభివర్ణించారు. సోషల్ వర్క్ పూర్తి చేసిన విద్యార్థులకు అనేక విభాగాల్లో ఫెలోషిప్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సుమారు పది రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి ఫెలోషిప్‌లు కూడా ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ రాములు, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమాయకులపై ఉగ్రదాడులు శోచనీయం



ఏయూలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న విద్యా విభాగాధిపతి షారోన్‌రాజు, ఆచార్యులు, విద్యార్థులు

విశాఖ విద్య: ఉగ్రవాదంతో దేశ భద్రతకు ముప్పు వస్తుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు అన్నారు. కశ్మీర్ పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో అసువులు బాసిన వారికి శుక్రవారం విభాగంలో విద్యార్థులతో కలిసి ఆయన కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అమాయకులైన పర్యాటకులపై ముష్కర మూకలు విరుచుకుపడటం, ప్రాణాలను హరించడం శోచనీయమన్నారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ మౌనం పాటించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఇటువంటి చర్యలకు తగిన గుణపాఠం, సమాధానం చెప్పాలన్నారు. ప్రజలంతా ఐక్యంగా ఉంటూ మృతుల కుటుంబాలకు బాసటగా నిలిచి మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు డాక్టర్ ఆలీ, డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ సాల్మన్, డాక్టర్ రాము విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

భద్రతాధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఉక్కునగరం: భద్రతాధికారులు అప్రమత్తతతో విధులు నిర్వహించడం ద్వారా ప్రమాదాల నివారణకు కృషి చేయాలి స్టీల్‌ప్లాంట్ భద్రత విభాగాధిపతి జి. ఫణికుమార్ అన్నారు. భద్రతాధికారిగా ఆయన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ భద్రతాధికారి తమ అనుభవం, నైపుణ్యం రంగరించి ప్లాంట్‌లో రేటును తగ్గించేందుకు ప్రయత్నించాలన్నారు. ఉద్యోగులు పని చేసే ప్రదేశాల్లో పొంచి ఉన్న ప్రమాదాలను ముందుగానే గుర్తించి ఉద్యోగుల్లో అవగాహన కల్పించాలన్నారు. జోనల్ సేఫ్టీ ఆఫీసర్, అసోసియేషన్ ప్రధానకార్యదర్శి మల్లయ్య మాట్లాడుతూ ఉత్పత్తి, ఉత్పాదకతల్లో ప్రాసెస్ సేఫ్టీ, స్టీల్ సేఫ్టీ, ఎస్‌వోపీ, ఎస్ఎంపీ సూత్రాలను అమలు పరచడం వల్ల ప్రమాదాల స్థాయి తగ్గుముఖం పడుతుందన్నారు. కార్యక్రమంలో విభాగం డీజీఎంలు వై.ఎస్. రావు, ఎం. వరప్రసాదరావు, బి.కె. మిత్రా, పి.ఎస్. రావు, చింతా మోహనరావు, సాయి ప్రసాదరావు, పుల్లారావు, మోహన్‌బాబు, ఎం.ఎస్. ప్రసాద్, కృష్ణమూర్తి, అభిజిత్ వర్మ, మొగలేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.



ఉక్కు భద్రతాధికారి ఫణికుమార్‌ను సత్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు